క్లుప్తంగా

అంబులెన్స్‌లను పరిశీలించిన అమెరికా బృందం


అంబులెన్స్‌ల వద్ద అమెరికా విద్యార్థుల బృందం

మేడ్చల్: 1962 సంచార పశువైద్యశాలలను అమెరికాకు చెందిన విద్యార్థుల బృందం మేడ్చల్‌లో పరిశీలించారు. 1962, 108 అంబులెన్స్‌లను అమెరికాకు చెందిన విస్కాసిస్ యూనివర్సిటీ విద్యార్థులు బుధవారం మేడ్చల్‌లో సందర్శించి వాటి నిర్వహణ, అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకుని అధ్యయనం చేశారు. పశువులకు సోకే వ్యాధుల పట్ల పరిశోధన చేశారు. కార్యక్రమంలో 1962 ప్రాజెక్ట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ బాగిష్, మేనేజర్ జాన్ షాహిద్, డాక్టర్లు వినీతరెడ్డి, విఠల్, జిల్లా కోఆర్డినేటర్ సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ ఇందిర

కీసర: గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం చీర్యాల గ్రామం పరిధిలో సుమారు రూ.30 లక్షల హెచ్ఎండబ్ల్యూఎస్ నిధులతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ పనులను సర్పంచ్ తుంగ ధర్మేందర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుమల్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లోని పలు కాలనీల్లో వెలసిన ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్, రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. అదేవిధంగా గతంలో కొన్ని అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేశామని, త్వరలో వాటిపై చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీఎస్ స్రవంతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆవరణలో 'కాయకల్ప'


మొక్కకు నీరు పోస్తున్న మాధవరెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం కాయకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి హాజరై ఆస్పత్రి ఆవరణలో హెర్బల్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్యాధికారి కోట్యానాయక్, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, ఆస్పత్రి కమిటీ సభ్యురాలు మీనా, విజయ్, వైద్యులు రాజేంద్రప్రసాద్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీవనోపాధికి దాతల చేయూత

పోచారం: అన్నోజిగూడలోని వికలాంగుల కాలనీలో అన్వర్ పాషాకి జీవనోపాధి కల్పించేందుకు శ్రీరాజమాత ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా దాతలు రూ.25 వేలు పాషాకు అందజేసి షాపును ఏర్పాటు చేయించగా ఫౌండేషన్ స్థాపకుడు ఉదయ్‌రెడ్డి షాపును బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు మనోజ్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు, కాలనీవాసులున్నారు.


మంత్రి మల్లారెడ్డిని, మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న లక్ష్మాపూర్ ముదిరాజ్ సంఘం నేతలు మంద స్వామి, కటికల వెంకటస్వామి, కావలి నాగరాజు, భాస్కర్, గోపి, నగేష్, సంజీవులు, వెంకటేష్, కిష్టయ్య, శ్రీనివాస్‌లు. - శామీర్‌పేట


నూతన సంవత్సరం 2023 సందర్భంగా బుధవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న పోచారం మున్సిపల్ కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్. - పోచారం

ఇకనైనా.. పనులు జరిగేనా?!

- అమాత్యుని శంకుస్థాపనకు ఆరు నెలలు
- మంత్రి ప్రారంభించినా ముందుకు సాగని రోడ్డు పనులు
- పొలాలు, సమాధులు మునుగుతున్నాయని స్థానికుల ఆందోళన
- రోడ్డును త్వరగా నిర్మించాలంటున్న ప్రయాణికులు


తెగిన చిట్టేరుకుంట రోడ్డు(ఫైల్)


రోడ్డు పనులు అడ్డుకుంటున్న రైతులు, స్థానికులు

ఘట్‌కేసర్: జల వనరుల రక్షణకు సర్కారు నడుం బిగించినా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ప్రజాప్రతినిధుల అనాలోచిత హామీలతో జల వనరులకు ముప్పు ఏర్పడుతుంది. 2020లో కురిసిన భారీ వర్షాలకు పోలీస్ స్టేషన్ పక్కనున్న చిట్టేరుకుంట కల్వర్టు తెగిపోయింది. దీంతో ఎదులాబాద్, ఎన్ఎఫ్‌సీనగర్, బొక్కొనిగూడ, మాదారం, మర్పల్లిగూడ గ్రామాల ప్రజలే కాకుండా విజయవాడకు వెళ్లే వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. తాత్కాలికంగా మట్టి పోసి రాకపోకలు పునరుద్ధరించిన రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. నాయకులు, ప్రయాణికుల విన్నపం మేరకు ఆరు నెలల క్రితం మంత్రి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఇక రోడ్డు పనులు పూర్తవుతాయని భావించిన ప్రయాణికుల ఆశలు ఆవిరయ్యాయి. చిట్టేరుకుంట నిండటంతో నష్టం జరుగుతుందని కొందరు రోడ్డు పనులను ఆపడంతో పనులు ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు అన్నచందంగా మారింది.

మంత్రే చెప్పారుగా...

కుంటలోని నీటి మట్టం తగ్గడంతో రోడ్డు, భవనాల శాఖ అధికారులు ఇటీవల పనులు ప్రారంభించారు. పంట పొలాలు మునుగుతున్నాయని కొందరు, తాతముత్తాతల సమాధులు మునుగుతున్నాయని మరి కొందరు రైతులు పనులు అడ్డుకున్నారు. కుంటలో చుక్క నీరు నిలువ ఉండకుండా రోడ్డు పనులు చేపట్టాలని స్వయంగా మంత్రే చెప్పారుగా.. మీకేంటి పనులు ఆపుతారంటూ కాంట్రాక్టర్‌ను కూలీలు బెదిరించడంతో వారు మిన్నకుండిపోయారు.

మోస్తరు వర్షాలకే...

అడపా దడపా కురుస్తున్న వర్షానికి మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షం లేని సమయంలో కళ్లల్లో దుమ్ముపడుతుందని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. అధికారుల సమన్వయ లోపంతోనే పనులు జరుగుతున్నట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై రోడ్డు, భవనాల శాఖ ఈఈ శ్రీనివాసమూర్తిని వివరణ కోరగా ముంపు విషయమై రైతులు, స్థానికులు రోడ్డు పనులు అడ్డుకున్నారు. చిటేరుకుంట ముంపు విషయమై నివేదిక ఇవ్వాలని నీటి పారుదల శాఖ అధికారులను కోరడం జరిగింది. వారి నివేదిక అందగానే నింబధనల మేరకు రోడ్డు పనులు ప్రారంభిచడం జరుగుతుందని ఆయన తెలిపారు.

దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డు పనులు గాలికొదిలేయడంతో విపరీతంగా దుమ్ము లేస్తోంది. దీంతో వాహన రాకపోకల సమయంలో కళ్లల్లో దుమ్ము పడుతోంది. రోడ్డు పనులు యుద్ధ ప్రాదిపదికన పూర్తి చేయాలి.
– శ్రీనివాస్‌రెడ్డి, దత్తాత్రేయకాలనీ

పొలాలు మునుగుతున్నాయి



చిట్టేరుకుంట నిండిన సమయంలో మా పంట పొలాలు మునుగుతున్నాయి. మంత్రి ఆదేశానుసారం పంటలు మునగకుండా లోతు తక్కువగా ఉండే విధంగా పైపులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
– గోవర్ధన్‌రెడ్డి, రైతు ఘట్‌కేసర్

రెండేళ్లుగా నరకం అనుభవిస్తున్నాం



వర్షం వచ్చినా.. రాకున్నా.. తాము చాలా ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు కోసం తీసిన గుంతల్లో ప్రయాణికులు ప్రమాదానికి గుర య్యే అవకాశముంది. రెండేళ్లుగా నరకాన్ని చవి చూస్తున్నాం. వెంటనే పనులు ప్రారంభించాలి.
– సత్తిరెడ్డి, బొక్కొనిగూడ


రోడ్డు మధ్యన ఏర్పడిన గుంత(ఫైల్)


ఒక వైపు ఆగిన రోడ్డు పనులు, రోడ్డు మధ్యన గుంత(ఫైల్)

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు


ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంతో మాట్లాడుతున్న కమిషనర్ రామలింగం

జవహర్‌నగర్: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జవహర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ రామలింగం హెచ్చరించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ అధ్యక్షతన ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌తో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రామలింగం మాట్లాడుతూ.. జవహర్‌నగర్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్పొరేషన్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రజావసరాలకు కేటాయించిన స్థలాలను కాపాడుకోవాలని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటన్నింటిని గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం అధికారులు డీఈ బాలమురళి, ఫైర్ డిపార్ట్‌మెంట్ సీఐ శేఖర్‌రెడ్డి, ఎస్ఐ అనిల్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్, టీపీఎస్ స్రవంతి, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ పాండు, ఏఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓ పరీక్ష ఫలితాల్లో 'శ్రీచైతన్య' విద్యార్థుల సత్తా

మేడ్చల్: గతేడాది నవంబర్ నెలలో నిర్వహించిన ఐఎన్‌టీఎస్ఓ పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పరీక్షల్లో 421 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండో లెవల్‌కు అర్హత సాధించారని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. రెండో లేవల్ సాధించిన విద్యార్థులకు యాజమాన్యం పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జోన్ ఏజీఎం రమణారావు, కోఆర్డినేటర్ సీతారామిరెడ్డి, డీన్ జైపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భద్రత అందరి బాధ్యత

శామీర్‌పేట: తుర్కపల్లి గ్రామంలో బుధవారం బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ జీడిపల్లి కవితవేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పిల్లల భద్రత అందరి బాధ్యత అని, బడీడు పిల్లలు బడిలో ఉండాలన్నారు. బాల బాలికల రక్షణ కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ప్రతి నెల గ్రామసభలో బాలబాలికల, మహిళల సమస్యలను చర్చించుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ రవీందర్‌రెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ సభ్యులు శ్రావణ్‌కుమార్, ఉప సర్పంచ్, అంగన్‌వాడీ టీచర్ అనురాధ, విజయలక్ష్మీ, సుజాత, లావణ్య, జయ, డాక్టర్ సృజన, వీవో కవిత, లావణ్య, ఏఎన్ఎం లలిత పాల్గొన్నారు.

ఫొటోలు మార్ఫింగ్ చేస్తున్నారని విద్యార్థినుల ఆందోళన



ఘట్‌కేసర్: అవుషాపూర్‌లోని విజ్ఞాన భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదువుతున్న విద్యార్థుల వాట్సాప్ గ్రూప్‌లోని ఫొటోలను మార్ఫింగ్ చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధిత విద్యార్థినులు బుధవారం ఆందోళన చేపట్టారు. మార్ఫింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ.. హాస్టల్ వార్డెన్ హేమంత్‌రెడ్డి 2022 నవంబర్ 9న ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులు రెచ్చిపోయి విద్యార్థినుల డీపీ ఫొటోలను మార్ఫింగ్ చేసి తిరిగి వారికే పంపుతూ ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేస్తామని బెదిరిస్తున్నట్లు మొదటి సంవత్సరం చదువుతున్న ఈసీఈ విద్యార్థిని చెప్పారు. ఈ మేరకు సీఐ అశోక్‌రెడ్డి స్పందించి నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

అనిల్‌కుమార్‌కు సావిత్రిబాయి పూలే సేవారత్న అవార్డు


అవార్డును అందుకుంటున్న అనిల్‌కుమార్ ముదిరాజ్

జవహర్‌నగర్: సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలని ముదిరాజ్ మహాసభ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యూత్ అధ్యక్షుడు అరకల అనిల్‌కుమార్ ముదిరాజ్ అన్నారు. సావిత్రిబాయి పూలే 192వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో మహజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జవహర్‌నగర్‌కు చెందిన అనిల్‌కుమార్‌కు ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, ప్రముఖ కవి సతీష్ చందర్ చేతుల మీదుగా అనిల్‌కుమార్‌కు అవార్డును ప్రదానం చేశారు. తన సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేసినందుకు సంతోషంగా ఉందని ఈ సందర్భంగా అనిల్‌కుమార్ అన్నారు.

బస్తీ దవాఖానాల పరిశీలన


బస్తీ దవాఖానాను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని యమ్నంపేట్, పోచారం ప్రాంతాల్లో నిర్మిస్తున్న బస్తీ దవాఖానాలను చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో దవాఖానాను రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నామని, పనులను త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ సురేష్, బీఆర్ఎస్ నాయకులు గొంగళ్ల బాలేష్, నర్రి కాశయ్య, బద్దం జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ హరికృష్ణ

ఘట్‌కేసర్: ప్రస్తుత సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాచకొండ ఏసీపీ ఎస్‌వీ హరికృష్ణ అన్నారు. బుధవారం చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై జరిగిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో వాలాదేవీలు జరిపేటప్పుడు ఓటీపీ విషయంలో జాగ్రత్త వహించాలని, సమాజంలో సైబర్ నేరాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని చెప్పారు. వీటిని కట్టడి చేసేందుకు అవగాహన ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సీఐ ఎం.సురేందర్, కళాశాల డైరెక్టర్ డా.సీవీ కృష్ణారెడ్డి, డీన్ డా.జి.జనార్ధన్ రాజు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

కీసర: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో కీసరలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభకనబర్చారు. గుండ్లపోచంపల్లిలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజుల పాటు జరిగిన పోటీల్లో విద్యార్థులు 12 వెండి, 4 రజత పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ రాములు తెలిపారు. చీకమిమామిడి బాలుర పాఠశాల విద్యార్థులు 4 బంగారం, 8 వెండి, 2 రజిత పతకాలు సాధించారు. కాగా ఏడో తరగతి విద్యార్థి వి.వరుణ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. తుర్కపల్లి విద్యార్థులు 2 బంగారు, 4 రజత పతకాలు సాధించారు. తొమ్మిదో తరగతి విద్యార్థి అశోక్ జాతీయ స్థాయిలో ఎంపికయ్యారు. మంగళవారం రాత్రి పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ కార్యదర్శి మల్లయ్యబట్టు విద్యార్థులకు పతకాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సందీప్, శిక్షకులు వీరబాబు, సురేష్, పీఈటీ కల్యాణి, గోదావరి, జ్యోతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పతకాలు సాధించిన విద్యార్థులతో మల్లయ్యబట్టు

అర్చకులు, ఉద్యోగుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న అర్చకులు, ఉద్యోగులు

కీసర: హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్, రెంజర్ల రాజేష్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు, ఉద్యోగులు, భక్తులు నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ అర్చక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మూర్తి సత్యనారాయణశర్మ, ప్రధాన అర్చకులు బలరామశర్మ, అర్చకులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

టీకా కేంద్రాలు ప్రారంభం


వ్యాక్సిన్ బాక్స్‌ను ఓపెన్ చేస్తున్న జెడ్పీటీసీ శైలజారెడ్డి

మేడ్చల్: మండలంలోని శ్రీరంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన చిన్న పిల్లల టీకా కేంద్రాన్ని జెడ్పీటీసీ శైలజారెడ్డి ప్రారంభించారు. 9 నెలల చిన్నారుల నుంచి సంవత్సరంన్నర వయసు ఉన్న పిల్లలకు కేంద్రంలో టీకాలు వేస్తారని తెలిపారు. తల్లింతడ్రులు తమ చిన్నారులకు తప్పకుండా టీకాలు వేయించాలని కోరారు.

మేడ్చల్‌లో...

పట్టణంలోని దూద్‌కానాలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని కౌన్సిలర్ మహేష్ ప్రారంభించారు. ఎంఆర్–1, ఎఫ్ఐపీవీ, జేఈ, పీసీవీ, బూస్టర్ డోసులు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు. కార్యక్రమాల్లో వైద్యులు, సర్పంచ్ విజయానంద్ రెడ్డి, ఏంఓ శైలజ, సీహెచ్ఓ మహల, ఎంపీహెచ్ఓ అహ్మద్ ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నారపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిగా శోభన

పోచారం: నారపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ శోభన నియమితులయ్యారు. గత ఐదేళ్లుగా ఇదే కేంద్రంలో వైద్య సేవలందించి, రెండు సార్లు ఉత్తమ వైద్యాధికారిగా అవార్డు అందుకున్న డాక్టర్ జి.యాదగిరి యాదాద్రి జిల్లాలోని బీబీనగర్ మండలానికి బదిలీపై వెళ్లారు.

58, 59 జీఓలపై ప్రజలకు అవగాహన కల్పించాలి


మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

జవహర్‌నగర్: 58, 59 జీవోపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కార్మిక మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్కే మస్తాన్‌బీ అన్నారు. ఈ మేరకు మేయర్ మేకల కావ్యను కార్మిక మహిళా సమాఖ్య సభ్యులు బుధవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 120 గజాల వరకు ప్రభుత్వ భూమి ఉచితంపై ప్రభుత్వం దశానిర్ధేశం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని కాలనీల్లో డ్రైనేజీలతో పాటు సీసీరోడ్లను ఏర్పాటు చేయాలని, హౌస్‌టాక్స్‌పైన యజమాని ఇంటిపేరు లేకుండా చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కేఎంఎస్ ఇన్‌చార్జ్ మీరా, కార్మిక మహిళా సమాఖ్య సభ్యులు రమాదేవి, రాములమ్మ, నాగమణి, పంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పావనీయాదవ్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ఘట్‌కేసర్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ మంత్రి చామకూర మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యలను కోరారు. ఈ మేరకు వారి కార్యాలయంలో బుధవారం కలిసిన ఆమె పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడంతో పాటు మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జంగయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగ అన్వేషణ కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యం


దేవేందర్

జవహర్‌నగర్: ఉద్యోగ అన్వేషణ కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ చంద్రశేఖర్ వివరాల ప్రకారం.. కార్పొరేషన్ పరిధిలోని బాలజీనగర్ జ్యోతికాలనీకి చెందిన గుగులోతు దేవేందర్(34), భార్య చంద్రకళతో కలసి నివాసముంటున్నాడు. డిసెంబర్ 25న అతడు ఉద్యోగాన్వేషణ కోసం హైటెక్ సిటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి అప్పటి నుంచి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం బంధువులతో పాటు సమీప ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తొలిమెట్టు మేళవింపు.. విద్యార్థులకు మేలు

- విద్యార్థుల్లో కనీస విద్యా సామర్థ్యాల పెంపునకు విద్యాశాఖ చర్యలు
- విద్యాసంవత్సరం ముగింపులోపు పట్టు సాధించేందుకు కసరత్తు
- మండల స్థాయిలో క్లస్టర్ల వారీగా పూర్తయిన బోధన ఉపకరణాల మేళా
- సంక్రాంతిలోగా జిల్లా స్థాయిలో.. తర్వాత రాష్ట్ర మేళా నిర్వహణపై దృష్టి


ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనా ఉపకరణాలు

సాక్షి, మేడ్చల్‌జిల్లా: విద్యార్థుల్లో కనీస విద్యా సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ 'తొలిమెటు'కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యా సంవత్సరం చివరి నాటికి విద్యార్థులకు రాయడం, చదవడం, కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలపై పట్టు సాధించేందుకు ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 375 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 25 ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న 40వేల మంది విద్యార్థులకు తొలిమెట్టు కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోంది. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పింది విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునేందుకు బోధనా ఉపకరణాలు అవసరమని ×తొలిమెట్టు×కార్యక్రమాన్ని పరిశీలించిన బృందాలు సర్వేలో తేల్చాయి.

- ఉపాధ్యాయులు పాఠ్యాంశాలకు సరిపడా ఉపకరణాలు ముందే సిద్ధం చేసుకుని బోధించాలని సూచించగా.. మేడ్చల్ జిల్లాలో 15 మండలాల్లో స్థానిక స్థాయిలో బోధనా ఉపకరణాల మేళాను 34 క్లస్టర్లలో విజయవంతంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయుల బోధనా ఉపకరణాలతో మేళా నిర్వహించాలని ఉన్నత స్థాయి అధికారులు నిర్ణయించారు. ఈ మేళాలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఉపకరణాలతో బోధిస్తే విద్యార్థులకు సులువుగా అర్థం కావడంతో పాటు వారిలో ఆలోచనశక్తి పెరుగుతోందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

సంక్రాంతి లోపే జిల్లాస్థాయి మేళా..

- జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12 వరకు సంక్రాంతి పండగకు ముందు జిల్లా స్థాయిలో బోధనా ఉపకరణాల మేళా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అన్ని మండలాల్లో ప్రదర్శనలకు వచ్చిన ఉపకరణాల్లో ఎంపిక చేసిన ఉత్తమమైన అయిందింటిని విద్యాశాఖ ఈనెల 12 న నిర్వహించే జిల్లా స్థాయి మేళాకు తీసుకువస్తారు. జిల్లాస్థాయిలోనూ ఉత్తమమైన ఐదింటిని రాష్ట్రస్థాయి మేళాకు ఎంపిక చేస్తారు.రాష్ట్ర స్థాయి మేళాను సంక్రాంతి పండగ తర్వాత నిర్వహించేదుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బోధనా ఉపకరణాల మేళాకు తక్కువ సమయం ఉండటంతో ఇప్పటికే ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఉపకరణాల తయారీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఇటీవల నిర్వహించిన పాఠశాల సముదాయాలు, కస్టర్ల సమావేశాల్లోనూ ఉపాధ్యాయులు ఉపకరణాలను ప్రదర్శించారు. వాటికి భిన్నంగా ఉత్తమమైన వాటిని తయారు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఆలోచనలు కలిగించేలా..

- నాలుగు గొడల మధ్య చదువుతున్నామన్న భావన కలగకుండా స్వేచ్ఛాయుత ఆలోచన ధోరణితో విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునేలా బోధనా ఉపకరణాలు రూపొందించారు. పిల్లలకు సరళంగా అర్థమయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విద్యార్థుల్లో పరిశీలనా జ్ఞానంతో పాటు ఆలోచనలు రేకెత్తించే విధంగా బాహ్య, అంతర్గత పరిశీలనకు ఉపయోగపడే ఉపకరణాలతో విద్యార్థులు మమేకమయ్యేలా ఉపాధ్యాయులు తమ మేధోశక్తిని ఉపయోగించి ఉపకరణాలను తయారు చేస్తున్నారు.